సాక్షి
అనకాపల్లి
మంగళవారం : 2 : జనవరి : 2024



లలితా పీఠం క్యాలెండర్
విశాఖ: శ్రీలలితా పీఠం రూపొందించిన 2024 వార్షిక క్యాలెండర్‌ను సోమవారం పీఠం దర్బారు హాలో ఆవిష్కరించారు.



ధాన్యం నిల్వలో జాగ్రత్తలు
యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చు. ధాన్యం దెబ్బతినకుండా కాపాడవచ్చు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

రేంజ్ ఐజీగా హరికృష్ణ బాధ్యతల స్వీకారం



ఐజీ హరికృష్ణను అభినందిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ ఐజీగా హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణకు ఐజీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన ఇక్కడే ఐజీ హోదాలో కొనసాగుతారు. అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తదితర ఉత్తరాంధ్ర పోలీసు అధికారులు ఆయనను అభినందించారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

తుమ్మపాల: 'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0' ద్వారా నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్, సర్వేయర్ కోర్సుల్లో ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్టు నాక్ సహాయ సంచాలకుడు రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్), ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మాకవరపాలెం 'నాక్' శిక్షణ కేంద్రంలో శిక్షణతోపాటు స్టేషనరీ ఉచితంగా అందజేస్తామన్నారు. పదో తరగతి పాసైన 15 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సంబంధిత రంగంలో (ప్రైవేటు సెక్టార్లలో) ఉపాధి కల్పిస్తామన్నారు. ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. మరింత సమాచారం కోసం 7780275922కు సంప్రదించాలన్నారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు భాగస్వామ్యం ఎంతో అవసరమని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతి కుమారి అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను సోమవారం తన చాంబర్‌లో ఆ సంఘం ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి కుమారి మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఆర్జేడీ కార్యాలయ పరిధిలో ఉన్న ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యలను సకాలంలో పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానన్నారు. పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసులకు ప్రశంసా పత్రాలు



అవార్డు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో గతేడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన 21 మంది పోలీసు అధికారులకు, 39 సిబ్బందికి న్యూఇయర్ సందర్భంగా ఉత్తమ అవార్డులు అందించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ వారికి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

రైతులకు సకాలంలో రుణాలు

డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు



కేక్ కట్ చేస్తున్న కోలా గురువులు

విశాఖ విద్య: రైతులకు అవసరమైన రుణాలను సకాలంలో అందించనున్నట్టు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కోలా గురువులు తెలిపారు. సోమవారం మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆయన న్యూ ఇయర్ కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరంలో బ్యాంకు వ్యాపారం రూ.2,500 కోట్లకు పెరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. రుణాల మంజూరులో నిబంధనలు సరళతరం చేస్తూ, అధికార వికేంద్రీకరణకు అవకాశం కల్పించామన్నారు.

చరిత్ర తిరగరాసేలా...



తారువలో అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు (ఫైల్)



అసైన్డ్ భూములకు ప్రభుత్వం అందించిన యాజమాన్య హక్కు పత్రాలతో ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

- అసైన్డ్ భూములపై అన్నదాతలకు సంపూర్ణ హక్కులు
- జిరాయితీ భూమితో సమానంగా చట్టబద్ధత
- అసైన్ చేసి 20 ఏళ్లు పూర్తయిన రైతులు లబ్ధిదారులుగా గుర్తింపు
- ఇకపై ప్రతీ ఏటా అర్హులైన రైతులకు పత్రాలు మంజూరు
- యాజమాన్య హక్కులతో క్రయ విక్రయాలకు అద్భుత అవకాశం
- అన్నదాతల ఆత్మ బంధువు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

హక్కు పత్రాలు జారీ చేసిన అసైన్డ్ భూములు 5016 ఎకరాలు

లబ్ధి పొందిన నిరుపేద రైతులు 4222 మంది

దేవరాపల్లి: దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో దశాబ్దాలుగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న బడుగు, బలహీన వర్గాల పేద రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంపూర్ణ హక్కులు కల్పించింది. డి-పట్టాలు పొంది ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నా తమ అవసరాలకు అమ్ముకునే అవకాశం లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తొలగించారు. అసైన్డ్ రైతులకు మేలు చేకూర్చడమే ధ్యేయంగా 35/2023 చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రకారం అసైన్డ్ పట్టాలు పొంది 20 ఏళ్లు దాటిన రైతులకు విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు. ఒరిజినల్ పట్టాదారు లేదా వారి వారసుల ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములకు భూ బదలాయింపు హక్కులు సంక్రమించేలా చట్ట సవరణ చేశారు. ఈ నేపధ్యంలోనే ఈ అసైన్డ్ భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రభుత్వం చట్టబద్ధమైన సర్వ హక్కులు కల్పించింది.

నిరంతర ప్రక్రియ

ఈ ఏడాది జూలై 31 నాటికి 20 ఏళ్లు పూర్తయిన (2003 కంటే ముందు అసైన్ చేసిన) భూముల అనుభవదారులను లబ్ధిదారులుగా గుర్తించి ఈ హక్కులు కల్పించారు. ఇటీవల దేవరాపల్లి మండలం తారువలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన మండలాల్లో సైతం అందించేందుకు అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. జిల్లాలో 4222 మంది రైతులకు సంబంధించి 5,016 ఎకరాల అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించారు. వచ్చే ఏడాది జూలై నాటికి 20 ఏళ్లు పూర్తయిన మిగతా రైతులకు కూడా ఈ హక్కు పత్రాలను అందజేస్తారు. ఇలా ప్రతి ఏటా జరుగుతుంది.

యాజమాన్య హక్కులతో ప్రయోజనం

గతంలో అసైన్డ్ భూములను సాగు చేసుకుంటూ ఫలసాయాన్ని పొందడం తప్ప కొనుగోలు అమ్మకాలు చేసుకునే వెసులుబాటు లేదు. సదరు రైతుల పిల్లల చదువులు, పెళ్లి సమయంలో సైతం కనీసం బ్యాంక్ రుణం పొందే అవకాశం లేదు. గత టీడీపీ ప్రభుత్వం ఈ భూములన్నింటినీ 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చింది. దీంతో నామమాత్రపు ధరలకు అనధికారికంగా విక్రయించాల్సిన దుస్థితి ఉండేది. తాజాగా ప్రభుత్వం యాజమాన్య హక్కులు కల్పించడంతో రైతులు జిరాయితీ భూములు మాదిరిగా తమ సొంత అవసరాలకు అమ్ముకునేందుకు, వారసత్వపు ఆస్తిగా అందించేందుకు అద్భుత అవకాశం లభించింది. ఒకపక్క అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించిన ప్రభుత్వం మరోపక్క బంజరు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు కొత్తగా డి-పట్టాలు పంపిణీ ప్రక్రియను ప్రారంభించింది.

కలలో కూడా ఊహించలేదు



40 ఏళ్ల నుంచి మూడు ఎకరాల బంజరు భూమిని సాగు చేసుకుంటూ బతుకుతున్నాం. కనీసం తనఖా పెట్టుకునే అవకాశం కూడా లేకపోవడంతో భూమి ఉన్నా మాకు ఎటువంటి భరోసా దక్కలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దయతో బంజరు భూమిపై జిరాయితీతో సమానంగా అన్ని హక్కులు కల్పించారు. ఇప్పుడు ఎక్కువ డబ్బులు ఇస్తామని మా చుట్టూ తిరుగుతున్నారు. ఈ మేలు కలలో కూడా ఊహించలేదు.

–పోడెల సూరిదేముడు, వాలాబు గ్రామం, దేవరాపల్లి మండలం

భూముల ధరలు పెరిగాయి



మాకు సమ్మెదలో ఒక ఎకరం 83 సెంట్ల బంజరు భూమి ఉంది. యాభై ఏళ్ల నుంచి సాగు చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాం. కుటుంబ అవసరాల కోసం రెండుసార్లు తనఖా పెట్టుకోవాలని చూశాం. మరీ తక్కువ డబ్బులకు అడగటంతో ఇవ్వలేదు. ఈ భూములను అమ్ముకునేందుకు అవకాశం లభిస్తుందని అనుకోలేదు. ప్రభుత్వం యాజమాన్య హక్కు పత్రం అందించడంతో భూముల ధరలు పెరిగాయి.

–దేవరి ఎర్రయ్యమ్మ, సమ్మెద, చింతలపూడి పంచాయతీ

రైతుల బతుకుల్లో మేలి మలుపు



అసైన్డ్ భూములపై ప్రభుత్వం సర్వహక్కులు కల్పించడం చాలా గొప్ప విషయం. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. జిల్లాలో 5016 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 4222మంది రైతులను అర్హులుగా గుర్తించాం. వీరికి యాజమాన్య హక్కు పత్రాలను అందజేస్తాం. ప్రతీ ఏటా క్రమం తప్పకుండా అర్హత సాధించిన రైతులకు హక్కుపత్రాలు అందిస్తాం.

–బి.దయానిధి, జిల్లా రెవెన్యూ అధికారి, అనకాపల్లి జిల్లా

అసైన్డ్ భూములపై ఈ ఏడాది యాజమాన్య హక్కులు పొందిన రైతులు, విస్తీర్ణం వివరాలు

అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో..

మండలం	రైతులు	విస్తీర్ణం (ఎకరాలలో)
అనకాపల్లి	94	173.455
అచ్యుతాపురం	169	184.014
బుచ్చెయ్యపేట	292	427.942
చోడవరం	179	157.798
దేవరాపల్లి	179	180.271
కె.కోటపాడు	41	51.754
కశింకోట	64	82.502
మునగపాక	5	5.028
పరవాడ	23	60.772
రాంబిల్లి	41	51.122
సబ్బవరం	356	284.906
యలమంచిలి	124	159.883.

నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో..

మండలం	రైతులు	విస్తీర్ణం (ఎకరాలలో)
చీడికాడ	256	183.034
గొలుగొండ	258	353.78
కోటవురట్ల	435	569.920
మాడుగుల	592	688.633
మాకవరపాలెం	126	149.697
నక్కపల్లి	86	108.37
నర్సీపట్నం	63	41.932
నాతవరం	312	299.33
పాయకరావుపేట	63	214.243
రావికమతం	409	546.987
రోలుగుంట	12	11.11
ఎస్.రాయవరం	43	30.175

ప్రపంచ ఖ్యాతే లక్ష్యంగా విశాఖ నగరాభివృద్ధి

న్యూ ఇయర్ వేడుకల్లో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్



జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్ (విశాఖ): ప్రజలకు మెరుగైన సేవలతో పాటు ప్రపంచ ఖ్యాతే లక్ష్యంగా విశాఖ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. 2023 సంవత్సరం ఒక మంచి ముగింపుగా నిలిచిందని, 2024లో మరిన్ని మెరుగైన ప్రాజెక్టుల అభివృద్ధికి జీవీఎంసీ కృషి చేస్తుందని కమిషనర్ తెలిపారు.

పారిశుధ్య పనుల నిర్వహణకు చర్యలు

మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా నగరంలో పారిశుధ్యం పనుల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. జీవీఎంసీ కార్మికుల అవసరాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమ్మె కాలంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, నగర పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణ దిశగా తమ వంతు బాధ్యతగా జీవీఎంసీ ఏర్పాటు చేసిన డంపర బిన్‌లలో వ్యర్థాలు వేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల్లో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మేయర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

మేయర్ గొలగాని హరివెంకటకుమారిని సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కలిసిన పలువురు కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు, జీవీఎంసీ అధికారులు, జోనల్ కమిషనర్లు, సిబ్బంది, పలు సంఘాల ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేయర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు, గుమ్మడి నరసింగరావు, కారె ఎల్లయ్య, డొక్కర పోలరావు, వెంకునాయుడు, తాతారావు, వెంకట్రావు, ఎల్లారావు, సూరిబాబు పాల్గొన్నారు.

రూ.3 వేల పింఛన్.. ఆనందం పంచెన్



చౌడువాడలో లబ్ధిదారునికి రూ.3 వేల పింఛన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్

- రూ.250 పెంపుతో లబ్ధిదారుల దరహాసం

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేశారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. మండలంలో చౌడువాడలో సోమవారం లబ్ధిదారులకు పెంచిన రూ.250తో కలిపి మొత్తం రూ.3 వేల పింఛన్ సొమ్ము అందించారు. ప్రతీ ఇంటికి పెద్ద కొడుకులా వృద్ధులు, వితంతువుల ఇబ్బందులను గుర్తించి ఈ మొత్తం అందిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి వ్యయప్రయాసలు లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీన లబ్దిదారుల ఇంటి వద్దకే వలంటీర్లను పంపించి అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధితో పని చేస్తున్న సీఎం జగన్‌కు ఎల్లప్పుడూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ చైర్మన్ ఆకుల సాయి ప్రసాద్, మాడుగుల ఏఎంసీ డైరెక్టర్ రాజి శ్రీను, వారాది అప్పారావు, వార్డు మెంబర్ చల్లా సురేష్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న జగన్



గత ఎన్నికల సమయంలో సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచబోతున్నట్లు జగన్‌బాబు ప్రకటించాడు. అన్నమాట ప్రకారం ఏటా రూ.250 చొప్పున పెంచి, ఈ నెల నుంచి రూ.3 వేలు ఇస్తున్నాడు. నా అనారోగ్య వైద్య ఖర్చులకు ఈ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతోంది. వృద్ధాప్యంలో ఎవ్వరిపైనా ఆధారపడకుండా మేలు చేస్తున్నాడు.

– చిరికి ముత్యవమ్మ, వితంతు పింఛన్ లబ్ధిదారు, చిరికివానిపాలెం, కె.కోటపాడు మండలం

పెద్ద కుమారుడిలా..



ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికే నేరుగా వలంటీర్ పింఛన్ సొమ్ము తీసుకొస్తున్నాడు. ఈ నెల నుంచి పెంచిన నగదు కలిపి రూ.3 వేలు అందుకున్నా. గత ప్రభుత్వాల కాలంలో పింఛన్ తీసుకోవడానికి అష్టకష్టాలు పడేవాళ్లం. ఇప్పుడు ఇంటికి పెద్ద కుమారుడిలా సీఎం జగన్‌బాబు మాకు కష్టం కలగకుండా పింఛన్ సొమ్ము పంపుతున్నాడు. మాట తప్పని నాయకుడి రుణం తీర్చుకోలేనిది.

– ఆళ్ల పైడినాయుడు, వృద్ధాప్య లబ్ధిదారు, చౌడువాడ, కె.కోటపాడు మండలం

శ్రీవారి ఆలయంలో పుష్పయాగం

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీ మామిడి తోటలో కొలువుదీరిన పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగం చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పుష్పయాగం చేశారు. కోలాటం, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ యాగంలో పాల్గొన్నారు.



అనకాపల్లి గవరపాలెంలో శ్రీకృష్ణుడికి పుష్పాభిషేకం చేస్తున్న భక్తులు



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్



కేక్ కట్ చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

నూతన సంవత్సర వేడుక.. ఆనందోత్సాహాలకు వేదిక

కోటి ఆశలతో కొత్త సంవత్సరం ప్రవేశించింది. అతివలు రంగవల్లికలతో స్వాగతం పలికారు. ఆదివారం రాత్రి మొదలైన సంబరాలు సోమవారమంతా కొనసాగాయి. ఉదయాన్నే దేవాలయాలు, ప్రార్థనా మందిరాలను దర్శించి, ఏడాదంతా ఆనందంగా గడవాలని ప్రజలు కోరుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల కార్యాలయాల్లో సందడి నెలకొంది. సందర్శకులు వారికి అభినందనలు, అభివందనాలు తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది కూడా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కలెక్టర్ అభిలషించారు. అలాగే జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్వో దయానిధిలకు రెవెన్యూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో పోలీస్ సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ కేక్ కట్ చేశారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

– అనకాపల్లి/తుమ్మపాల

క్లుప్తంగా

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ధర్మశ్రీ

చోడవరం : నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను అసోసియేషన్ నాయకుల సమక్షంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆవిష్కరించారు. చోడవరం పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన వేడుకల్లో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ విశాఖజిల్లా, అనకాపల్లి జిల్లాల నాయకులు పాల్గొని 2024 క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పీఆర్సీ, డీఏ బకాయిలు మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అసోసియేషన్ నాయకులు ధర్మశ్రీని కోరారు. విషయాన్ని ముఖ్యమంత్రికి తెలియజేస్తానని ధర్మశ్రీ చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గంగాధర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కుచ్చు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి రొంగలి మంగనాయుడు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అచ్యుతాపురం కో–ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్

అచ్యుతాపురం : నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్రకు అచ్యుతాపురం కో–ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆమెను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

మేడ పైనుంచి పడి యువకుడి మృతి

బీచ్ రోడ్డు: ప్రమాదవశాత్తు మేడ పైనుంచి పడి ఒక యువకుడు మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లోని ఒక రెస్టారెంట్‌లో అసిస్టెంట్ కుక్‌గా పని చేస్తున్న గణేష్ దాసు(36) అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం మేడ పైనుంచి ప్రమాదవశాత్తు కిందకి పడిపోయాడు. దీంతో అక్కడకక్కడే ఆయన మృతి చెందాడు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తప్పనిసరి

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- 12 శాతం తేమ ఉండే వరకు ధాన్యాన్ని ఆరబెట్టాలి



యంత్రం సహాయంతో వరి పంటను నూర్చుతున్న రైతులు



కోసిన వరి చేనును పొలంలో ఆరబెడుతున్న దృశ్యం

బుచ్చెయ్యపేట: రైతు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను సకాలంలో కోసి కళ్లాలకు చేర్చడం ఒక ఎత్తయితే, దాన్ని సకాలంలో నూర్పిడి చేసి ధాన్యాన్ని ఏడాది తిండి గింజల కోసం, ధర వచ్చినప్పుడు అమ్ముకోవాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు అవలంబించకపోతే ఏడాది పొడవున దాచే ధాన్యం దెబ్బతింటాయి. రైతన్న కష్టమంతా వృథా అయి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. అటువంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ చెబుతూ.. పలు సూచనలు చేశారు.

- నూర్చిన ధాన్యాన్ని 12 శాతం తేమ ఉండే వరకు ఆరబెట్టాలి.
- రసాయన ఎరువులను ధాన్యంపై నేరుగా పిచికారీ చేయకూడదు. ఇలా చేస్తే విష ప్రభావం ఎక్కువగా ఉండి ఆరోగ్యాలు దెబ్బతింటాయి.
- ధాన్యంపై కీటకాలు, పురుగులు ఆశించకుండా వేపాకు, సీతాఫలం గింజలు, వెల్లుల్లి, ఉసిరి గింజలను పొడి చేసి రెండు శాతం వరకు పొడిని ధాన్యంలో కలపాలి.
- ఇలా చేస్తే ఎనిమిది నెలల వరకు ధాన్యంలో పురుగు చేరకుండా ఉంటుంది.
- ఉత్తరేణి, కసివింద, ఉమ్మెత్త, మిరప, వేపాకులను ధాన్యం బస్తాల్లో కలిపి ఉంచిన నాలుగు నెలల వరకు ధాన్యంలో పురుగు చేరదు.

గోదాముల్లో ధాన్యం నిల్వ...

- గోదాముల్లో ధాన్యం నిల్వ చేసేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- గోదాము నేలపైన, గోడలకు, పై కప్పులకు రంధ్రాలు లేకుండా చూసుకోవాలి.
- తుపాను గాలులకు పై కప్పులు ఎగిరి పోకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- రంధ్రాలుంటే సిమెంట్‌తో ముందుగా పూడ్చాలి.
- ధాన్యం నిల్వలకు పాత గోనె సంచులను ఎక్కువగా ఉపయోగించరాదు.
- గోనె సంచులను ముందుగా 2 మిల్లీలీటర్ల మలాథియాన్ మందును లీటరు నీటిలో కలిపి పది నిమిషాలు మందు ద్రావణంలో నానబెట్టి ఎండలో ఆరబెట్టాలి.
- గోదాము గోడలకు, నేలపై పురుగు ఆశించకుండా 10 మిల్లీలీటర్ల మలాథియాన్ మందును లేదా 7 మిల్లీలీటర్ల డైక్లోర్‌వాస్ మందును నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చెక్క బల్లలపై ధాన్యం బస్తాలు వేసుకుంటే తేమ తగలకుండా ఉంటుంది.
- గోడలకు, పై కప్పుకు ధాన్యం బస్తాలు తగలకుండా నిట్ట వేసి, వర్షం నీరు గోదాముల్లోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎక్కువ కాలం ధాన్యం నిల్వ ఉంచకుండా సకాలంలో అమ్ముకుంటే రంగు మారదు. దిగుబడితో పాటు నాణ్యత ఉంటుంది.



- బస్తాలను 1–2 అడుగుల ఎత్తులో బెంజీలు, అరుగుల మీద వేస్తే భూమిపై ఉన్న తేమ లాక్కోదు.

అకాల వర్షాలకు పంట తడిస్తే..

- గాలి వర్షాలకు పండిన పంట నేలకొరిగితే వెంటనే వరి పంటను నిలబెట్టి కట్టలుగా కట్టాలి.
- కోసిన వరి పనలు తడిస్తే ఎండ తగిలేలా తడి ఆరేలా ఆరబెట్టాలి. గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి.
- వర్షం తగ్గని పరిస్థితుల్లో తడిచిన వరిని కుప్పలు పెడితే వరి పనలపై ఎకరాకు 25 కేజీల ఉప్పును చల్లి కుప్ప పెట్టాలి.
- తడిచిన ధాన్యం ఆరబెట్టడానికి వీలు కాకపోతే మొలకెత్తకుండా క్వింటా ధాన్యానికి కేజీ ఉప్పు, 20 కేజీల పొడి ఊకను కలిపి పోగు పెడితే మొలకెత్తకుండా జాగ్రత్తపడొచ్చు.

మెలకువలు పాటించాలి



జిల్లాలో ఈ ఏడాది లక్షా 50 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారు. అన్ని గ్రామాల్లోనూ ప్రస్తుతం నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్లు, ఎద్దుల సహాయంతో జోరుగా నూర్పుతున్నారు. పంట నూర్పి ధాన్యాన్ని భద్రపరచడంలో మెలకువలు పాటించాలి. నూర్చిన ధాన్యంలో 14 శాతం కన్నా తక్కువ తేమ ఉండేలా చూసుకోవాలి. ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా సకాలంలో అమ్మకాలు చేయడం, మిల్లులో బియ్యంగా ఆడించడం, ఎలుకలు సమస్య లేకుండా చూస్తే నష్టాలుండవు.

– కె. రాజ్‌కుమార్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, కొండెంపూడి, బుచ్చెయ్యపేట మండలం

పచ్చని చెట్లతో చక్కని ఆరోగ్యం



మొక్కలు నాటుతున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

తుమ్మపాల : ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లుగా పెంచాలని, తద్వారా మానవాళికి చక్కని ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జాతీయ రహదారి బైపాస్ రోడ్డు ×ఫ్లాగ్ మాస్ట్ పోల్ దగ్గర అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయనతో పాటు, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఇతర జిల్లా అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచినట్టయితే పర్యావరణంలో పుష్కలంగా ఆక్సిజన్ ఉత్పత్తి అవుతుందని దాని మూలంగా అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. 2024 నూతన సంవత్సరం ప్రారంభంలోనే తనకు ఈ అవకాశం లభించిందన్నారు. కాలుష్య నియంత్రణకు అత్యుత్తమ మార్గం మొక్కలు నాటడమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా విరివిగా మొక్కలు నాటాలన్నారు. మొత్తం 250 మొక్కలు నాటడం జరిగిందని సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్ఓ జి.లక్ష్మణ్ అన్నారు. మరో 750 మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. హేమంత్, సీపీవో జి.రామారావు, డీపీవో ఆర్.శిరీష రాణి, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజులవాణి, ఇతర శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి



తుమ్మపాల మెయిన్‌రోడ్డు వద్ద తోటాడ అమ్మాజీ మృతదేహం

అనకాపల్లి : హేచరీ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలు స్వల్పగాయాలతో బయటపడినట్టు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను అన్నారు. సీఐ కథనం మేరకు వివరాలు...మండలంలో తుమ్మపాల గ్రామానికి చెందిన ఆశ వర్కర్లు తుమ్మపాల పీహెచ్‌సీ ఆస్పత్రి పరిధిలో విధులు నిర్వహిస్తున్న తోటాడ అమ్మాజీ, మంగ, ప్రమీలాలు ఆసుపత్రి నుంచి తుమ్మపాల వెళ్లుతున్నట్లు సీఐ చెప్పారు. చోడవరం నుంచి అనకాపల్లి వస్తున్న హేచరీ వ్యాన్ ముందు ఉన్న ఆటోని ఢీ కొట్టడంతో అటుగా వెళుతున్న ముగ్గురు వ్యక్తులను ఆటో ఢీకొందని సీఐ తెలిపారు. ఈ ప్రమాదంలో అమ్మాజీ(45) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా మంగ, ప్రమీలలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోనసీమ అంబేడ్కర్ జిల్లా రావుపాలేనికి చెందిన హేచరీ వ్యాన్ డ్రైవర్ పైడిశెట్టి రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏపీఐడబ్ల్యూ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

పాస్టర్‌పై దాడి : ఐదుగురిపై కేసు

కశింకోట: తాళ్లపాలెంలో ఓ చర్చి పాస్టర్‌పై దాడి చేసి కొట్టి కులం పేరుతో దూషించిన ఐదుగురు ఆకతాయి యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద సోమవారం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపారు. తాళ్లపాలెం రామాలయం సమీపంలో ఉన్న చర్చిలో ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నూతన సంవత్సరం ప్రార్థనలు ముగించుకొని అక్కడికి సమీపంలో ఉన్న తన ఇంటికి నడిచి వెళుతున్న పాస్టర్ పొన్నాడ యాకబ్, భార్య, కుమారులను అదే గ్రామానికి చెందిన ఆకతాయి యువకులు ఎం.దుర్గా నాగేశ్వర్, కె.తరుణ్, సిహెచ్. మధుమోహన్‌సాయి, పెయ్యిల గణేష్, కె.ఏసు మద్యం మైకంలో అడ్డుకున్నారు. పాస్టర్‌పై చేయి చేసుకొని కొట్టి కులం పేరిట దూషించారు. బాధితుడి ఫిర్యాదు చేసిన మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

పోకిరీలకు దేహశుద్ధి

యలమంచిలి రూరల్ : పట్టణంలోని బస్ కాంప్లెక్స్ వద్ద కళాశాల విద్యార్థినులపై వెకిలి చేష్టలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులకు సోమవారం స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. ఏటికొప్పాక, పీఎస్ఆర్‌పేట గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు కొద్ది రోజులుగా యలమంచిలి బస్ కాంప్లెక్స్ వద్ద కళాశాల విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. ఇంటర్ చదుతున్న ఒక విద్యార్థిని ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో సోమవారం ఆ విద్యార్థిని కళాశాలకు వెళ్తున్న సమయంలో బస్ కాంప్లెక్స్ వద్ద ఆ ఇద్దరు యువకులు విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో వెనుకనే వస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు,బంధువులు ఇద్దరు యువకులకు అక్కడే దేహశుద్ధి చేసి పట్టణ పోలీసులకు అప్పగించారు. సోమవారం రాత్రి ఇద్దరు యువకులకు పట్టణ పోలీసులు, ఏటికొప్పాక గ్రామ పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థిని తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పి ఇంకెప్పుడూ అలా ప్రవర్తించమని రాతపూర్వకంగా పూచీకత్తులు రాయించారు. బస్ కాంప్లెక్స్, కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

డిప్యూటీ సీఎం, ప్రభుత్వ విప్‌కు శుభాకాంక్షలు



విశాఖలో డిప్యూటీ సీఎం బూడికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న ఎం. కోడూరు సర్పంచ్ సంజీవిరావు



చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విప్ ధర్మశ్రీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

మాడుగుల రూరల్/చోడవరం: ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు సోమవారం రాత్రి విశాఖలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రావికమతం వైస్ ఎంపీపీ గంట్ల రమణ పాల్గొన్నారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీకి 'నూతన' శుభాకాంక్షలు



ఎంపీ సత్యవతి దంపతులకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి

అనకాపల్లి : ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి దంపతులకు వారి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి పూలబొకేలు అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేత ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. జిల్లా దివ్యాంగ హక్కుల వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులు ఎంపీకి పూలబొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అదిష్టింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు ఈపూజ నిర్వహించారు. 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. తులసి ప్రసాదం భక్తులకు అందజేశారు.

ముగిసిన ఏకపాత్రాభినయ పోటీలు



ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటక పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పీఎం పాలెం: శిల్పారామం(జాతర) ఆడిటోరియంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర కళాకారుల ఏకపాత్రాభినయ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఉత్తరాంధ్ర పౌరాణిక పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం 7వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ పోటీల్లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 22 మంది కళాకారులు పోటీ పడి ప్రదర్శించారు. రాజాంకు చెందిన బండి కుమారి హరిశ్చంద్ర నాటకంలోని చంద్రమతి పాత్రకు ప్రథమ బహుమతి, పార్వతీపురానికి చెందిన నక్షత్ర పాత్రధారి తూడి భాస్కరరావుకు ద్వితీయ, కల్యాణి పిగకల సీను సత్యహరిశ్చంద్ర నాటకంలో నటనకు బహుమతులు అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న నటులందరికీ మెమోంటోలు బహూకరించి సత్కరించారు. చివరగా ప్రదర్శించిన నక్కీర, సత్యహరిశ్చంద్ర నాటకాలు ఆహూతులను అలరించాయి. పౌరాణిక పద్యనాటక రంగానికి విశేష సేవలు అందించిన కళాకారులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు, కళారత్న అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణ, నంది అవార్డు గ్రహీత వంకాయల మారుతీ ప్రసాద్, కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి నల్లనయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరాంధ్రను విస్మరించారు'



మాజీ మంత్రి కొణతాల

అనకాపల్లి: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రభుత్వాలు విఫలమైనట్లు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక గవరపాలెం కొణతాల సుబ్రమణ్యం ఘాట్ వద్ద ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేయడంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. దివంగత రాజశేఖరరెడ్డి ఆశయాలు నెరవేరలేదన్నారు. 32మంది ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పడ్డ విశాఖ స్టీల్‌ప్లాంట్ జాతీయ ప్రాజెక్టుగా ఎదిగిందని, బీజేపీ పాలనలో దానిని ప్రైవేట్‌పరం చేయడం దారుణమన్నారు. ప్రైవేటీకరణను ఆపేందుకు వైఎస్సార్‌సీపీ గట్టిగా కృషి చేయాలన్నారు. ప్రత్యేక హోదా గురించి కూడా ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న ఆలయ వార్షికోత్సవం

- గ్రామంలో తోడుపెద్దు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



సింహాద్రప్పన్నకు పూజలను నిర్వహిస్తున్న భక్తులు



తోడ పెద్దు సేవలో పాల్గొన్న భక్తులు

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామస్తులు సింహాద్రప్పన్న ఆలయ 8వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామానికి చెందిన గౌరీ సేవా సంఘం వారు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో సింహాద్రప్పన్న ప్రతిరూపంగా కొలిచే తోడపెద్దుతో పాటు ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ నారాయణమ్మ, మద్దాల రాము, జగ్గారావు, రాజేంద్రప్రసాద్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

శెట్టిపాలెం వీఆర్వో ఆత్మహత్య



మృతుడు వరప్రసాద్(ఫైల్)

నర్సీపట్నం: శెట్టిపాలెం వీఆర్వో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ సీఐ గణేష్ అందించిన వివరాల ప్రకారం..నర్సీపట్నం మున్సిపాలిటీ ఎస్సీ కాలనీకి చెందిన మర్రా వరప్రసాద్(29) మావకరపాలెం మండలం, శెట్టిపాలెం వీఆర్వోగా పని చేస్తున్నాడు. తండ్రి నూకరాజు వీఆర్వోగా పనిచేస్తూ చనిపోవడంతో కారుణ్య నియామకంలో వరప్రసాద్‌కు వీఆర్వో ఉద్యోగం ఇచ్చారు. మృతుడికి తల్లి సుశీల, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. పెద్ద చెల్లికి వివాహమైంది. వరప్రసాద్ వడ్డాదికి చెందిన వివాహితతో మూడేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నాడు. తన కుటుంబ సభ్యులు దీనిని వ్యతిరేకించడంతో బొడ్డేపల్లి థెరిస్సా కాలనీలో ఇల్లు అద్దె తీసుకుని ఇద్దరూ ఉంటున్నారు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా జీవితం మీద విరక్తి చెందిన వీఆర్వో ఆత్మహత్యకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎన్టీపీసీలో 'నూతన' వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ ఎస్.కె.సిన్హా, అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా కేక్ కట్ చేశారు. నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త ఆనందాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతక ముందు సావ్యస్ భవనంలో నూతనంగా పునరుద్ధరించిన సమ్మద్ హాలును ఆయన ప్రారంభించారు. వేడుకల్లో చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.గోవిందరాజన్, ఉన్నతాధికారులు ఎన్ గద్దం, డి.పి.పాత్రో, బి.బి.పాత్ర, సీనియర్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మండలంలోని వెంకుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో **మంగళవారం** ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.నరసింహరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో వివిధ రకాలైన వ్యాధులకు సంబంధించిన స్పెషలిస్ట్ వైద్యులు, బీపీ, సుగర్ తదితర వైద్య పరీక్షలు జరిపి, అవసరమైన మందుల్ని ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

కశింకోట: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు సోమవారం మండలంలోని పల్లపు సోమవరంలో నిరసన తెలిపారు. సంక్షేమ బోర్డు నుంచి ఇవ్వాల్సిన పథకాలు అందక ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. బిల్డింగ్ వర్కర్ల యూనియన్(సీఐటీయూ అనుబంధ) ప్రతినిధులు టి.అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, డి.శ్రీను, టి.శేషగిరిరావు, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

5న వయో వృద్ధుల సంఘ సమావేశం

అనకాపల్లి: పట్టణంలోని వీవీ రమణ రైతు భారతి హాలులో ఈ నెల 5న జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ



కార్మికునికి దుప్పటి అందిస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు పాల్గొని, కేక్ కట్ చేసి కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యతతో మెలగాలని సూచించారు. కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. సామాజిక సేవకులు కాండ్రేగుల శ్రీరాం సహాయంతో కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గురుంపల్లి వెంకటరావు, కార్యదర్శి అప్పారావు, కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	: రాజా
పిండం (మధ్యాహ్నం, రెండో ఆట)	
వెంకీ (మార్నింగ్, సాయంత్రం ఆట) :	సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	: సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	: షిర్డిసాయి
సలార్	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
సలార్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-31 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 338 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 316 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఇది కదా అభివృద్ధి

ఈ చౌడువాడ.. అభివృద్ధికి వెలుగు జాడ





ఈయన పేరు మేడిశెట్టి పోతురాజు. ఈ.చౌడువాడ పంచాయతీ పరిధి మేడిశెట్టి వారి ఇళ్ల ప్రాంతానికి చెందిన రైతు. వ్యవసాయం, పశు పోషణతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఆయనతోపాటు పది కుటుంబాలు వరి, ఇతర పంటలు సాగు చేస్తూ ఇక్కడే నివాసం ఉంటున్నారు. వీరి పొలాలకు చాలా కాలంగా సరైన రోడ్డు లేదు. ఏమాత్రం వర్షం వచ్చినా ఇబ్బందే. తమ రాకపోకలకు, పంట భూముల్లో వ్యవసాయ కార్యకలాపాలు, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు ఎంతో ఇబ్బంది పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.10 లక్షలతో ఊటగెడ్డ నుంచి మేడిశెట్టి వారి ఇళ్ల వరకు సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఇపుడు వర్షం వచ్చినా ఎలాంటి బెంగ లేదు. రోడ్డు నిర్మాణంతో మూడు దశాబ్దాల తమ కష్టాలు తీరాయని, సీఎం జగన్ ప్రభుత్వం చేసిన మేలు మర్చిపోలేమని ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండల శివారులో ఉన్న ఈశ్వర పల్లి (ఈ) చౌడువాడ (కన్నూరుపాలెం) పంచాయతీ అభివృద్ధికి చిరునామాగా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో రూ.4.75 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించారు. మరి కొన్ని పనులు తుది దశలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ గ్రామం నాలుగున్నరేళ్లలో అభివృద్ధికి నోచుకున్నట్లు గ్రామస్తులు ఆనందంగా చెప్తున్నారు.

- 4.75 కోట్లతో అభివృద్ధి పనులు
- నాలుగున్నరేళ్లలో సకల సౌకర్యాలు

కశింకోట: నర్సీపట్నం మార్గంలో మండల శివారు గ్రామమైన ఈ.చౌడువాడ పంచాయతీలో సుమారు 3 వేల జనాభా నివసిస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు స్వగ్రామం కావడంతో, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో భారీ నిధులతో పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. రెండు వేల కంటే ఎక్కువ జనాభా ఉండటంతో సచివాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు.

శుభకార్యాల నిర్వహణకు సరైన వసతి లేకపోవడాన్ని గుర్తించిన మంత్రి అమర్‌నాథ్ విశాఖ డెయిరీ సహకారంతో రూ.కోటి వెచ్చించి కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. భవన నిర్మాణం పూర్తి అయింది. తుది మెరుగులు చేపట్టాల్సి ఉంది. వీటితోపాటు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, చెరువుల్లో పూడిక తొలగింపు తదితర అభివృద్ధి పనులతో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.



తుది దశలో ఈ చౌడువాడ సచివాలయ భవనం



ఎస్సీ కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు, కాలువ



సుందరవనంలా అభివృద్ధి చేసిన చెరువు పార్కు



నిర్మాణం పూర్తయిన కల్యాణ మండపం

సుందర వనంగా చెరువు

ఈ.చౌడువాడ చెరువును సుందర వనంలా తీర్చిదిద్దారు. మంత్రి అమర్‌నాథ్ సొంతగా రూ.కోటి నిధులను సమకూర్చారు. దీంతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఇతర వ్యాయామాలు చేయడానికి అవసరమైన పరికరాలను, సదుపాయాలను సమకూర్చారు. చుట్టూ మొక్కలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు సేద తీరేలా బెంచీలు ఏర్పాటు చేశఋరు. దీంతోపాటు ఉమా కోటి లింగేశ్వరస్వామి ఆలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక శివారు పాత కన్నూరుపాలెంలో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు, రూ.5 లక్షలతో శ్మశానంలో షెడ్డు నిర్మించి అభివృద్ధి చేశారు.



మేడిశెట్టి వారి ఇళ్లకు నిర్మించిన సిమెంట్ రోడ్డు

ఈ చౌడువాడలో అభివృద్ధి వివరాలు

- సచివాలయ భవనం: రూ.60 లక్షలు
- వెల్‌నెస్ సెంటర్: రూ.40 లక్షలు
- కల్యాణ మండపం: రూ.కోటి
- పార్కు అభివృద్ధి : రూ.కోటి
- 8 చెరువుల అభివృద్ధి: రూ.60 లక్షలు
- నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి: రూ.45 లక్షలు
- మేడిశెట్టి వారి ఇళ్లు, గెద్దం వారి ఇళ్లకు సిమెంట్ రోడ్లు : రూ.20 లక్షలు
- ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం: రూ.25 లక్షలు
- కొమ్మోజువీధి, కూండ్రపు మాతయమ్మ వీధి, ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్లు: రూ.10 లక్షలు
- ఎస్టీ కాలనీలో కమ్యూనిటీ హాలు: రూ.5 లక్షలు
- పాత కన్నూరుపాలెంలో సిమెంట్ రోడ్, షెడ్డు నిర్మాణం: రూ.10 లక్షలు

అందుబాటులో అన్ని సౌకర్యాలు



గతంలో ప్రభుత్వ సేవల కోసం మండల కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థలో భాగంగా సచివాలయాన్ని ఏర్పాటు చేయడంతో ఆ తిప్పలు తప్పాయి. ప్రభుత్వ సేవలన్నీ అందుబాటులోకి వచ్చాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కూండ్రపు శ్రీను, ఈ.చౌడువాడ

జగన్ ప్రభుత్వంలో దశ తిరిగింది



చాలా కాలంగా ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్లు లేక రాకపోకలకు ఇబ్బంది పడేవాళ్లం. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కాకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహించేది. ఈ నేపథ్యంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కాలనీలో విరివిగా రోడ్లు, కాలువలు నిర్మించారు. సౌకర్యాలు మెరుగుపర్చారు. ఎంతో ఆనందంగా ఉంది.

–కోరిబిల్లి విజయ్, ఎస్సీ కాలనీ, కన్నూరుపాలెం

చెరువు అభివృద్ధితో ఆహ్లాదం



కన్నూరుపాలెంలో ప్రజల సౌకర్యార్థం రన్నింగ్ ట్రాక్‌తో చెరువును పెద్ద ఎత్తున పార్కుగా అభివృద్ధి చేశారు. గ్రామస్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. ఆరోగ్యవంతంగా ఉండటానికి నిత్యం వాకింగ్, యువత రన్నింగ్ చేయడానికి ఈ పార్కు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

–చుక్కా కన్నంనాయుడు, కన్నూరుపాలెం

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాల షెడ్యూల్ ఖరారు

సబ్బవరం: ప్రభుత్వం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రమేష్ నాయుడు సోమవారం తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించే వైద్య శిబిరాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు.

రెండో విడత శిబిరాలు మంగళవారం మొదలై మే 7వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. దీనిలో భాగంగా మంగళవారం బంగారమ్మపాలెంలోని ఎంపీపీ స్కూల్ ఆవరణలో శిబిరం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ నెల 9న అమృతపురం గ్రామ సచివాలయం ఆవరణలో, 23న మల్లునాయుడుపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో, 30న సబ్బవరం సచివాలయం-4 పరిధిలో వారికి ఎంపీపీ స్కూల్ ఆవరణలో శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

నేడు బంగారమ్మపాలెంలో..

సబ్బవరం: బంగారమ్మపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు స్పెషలిస్టు వైద్య సేవలు,కంటి సంబంధిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

పరవాడ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిపోతుందని అందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు ఇసుకతో ఉన్న లారీని సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను పరవాడలో నిల్వ చేసి అధిక రేట్లకు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారని పరవాడకు చెందిన పలువురు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ గఫూర్ పరవాడ సినిమాహాలు కూడలిలో రాజమండ్రి నుంచి వచ్చిన ఇసుక లారీని పట్టుకున్నారు. లారీలో ఇసుకకు సంబంధించిన బిల్లులను రాజమండ్రిలోని రీచ్‌కు పంపామని సదరు బిల్లులు అక్రమమా లేక సక్రమమా అనేది మంగళవారం నాటికి పూర్తి క్లారిటీ వస్తుందని డీటీ గఫూర్ చెప్పారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు

అనకాపల్లి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఏపీ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) అలుపెరుగని కృషి చేయాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీ త, జానకీరామరాజులు ఆకాంక్షించారు. వారి స్వగృహంలో సోమవారం ఏపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

కశింకోట: కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎపీటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను ఎంపీపీ కలగా లక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఏపీటీఎఫ్ నాయకులు పి.గణపతి, కె.సూర్యనారాయణ, పీఎం అప్పారావు, నేమాల రమణ, ఎం.ఎస్.క్రిస్టోఫర్, ఎ.నాగేశ్వరరావు, పీవీడీ ప్రసాద్, జి.దేముడుబాబు, కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రత్యేక అధికారి డి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చలపతిరావు ఆశయ సాధనకు కృషి



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు

అనకాపల్లి: బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, స్వర్గీయ పీవీ చలపతిరావు ఆశయసాధనకు పార్టీ నేతలు పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానం వద్ద సోమవారం చలపతిరావు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాల వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు భర్నికాన నర్సింహమూర్తి, కె.ప్రభాకర్, గంగుపాం నాగేశ్వరరావు, కోలపర్తి శ్రీనివాసరావు, కొడుకుల వెంకటరావు, గోకువాడ శ్రీరాములు, అలమండ శ్రీనివాసరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రతినిధి కొండబాబు, కార్యదర్శి కర్రి రామకృష్ణ, ఉడా రమేష్, వి.నర్సింగ్‌యాదవ్, జి.భక్తసాయిరాం పాల్గొన్నారు.

గ్రీన్ క్లబ్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి

అనకాపల్లి: గ్రీన్‌క్లబ్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, జాగృతి కార్యక్రమాలను క్లబ్ వ్యవస్థాకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ చేపట్టడం అభినందనీయమని సంఘ సేవకులు కర్రి సన్యాసినాయుడు అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో సోమవారం క్లబ్ 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ దేశం, ప్రకృతి, ప్రపంచం క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్ మానవాళి మనుగడ ఆధారపడి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణపై క్లబ్ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు క్లబ్ డైరీని ఆవిష్కరించి, పర్యావరణ హిత జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ మాజీ అధికారి బీరా వినోద్‌కుమార్, గౌరవాధ్యక్షులు పెంటకోట ఉమామహేశ్వరరావు, యల్లపు సూరి అప్పారావు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, కర్రి హనుమంతరావు, నైశెట్టి సత్తిబాబు, బేతాళం శేషసాయి, వీఎస్ఎస్ రామకృష్ణ, గంట్ల కృష్ణ, కుంచం నూకయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సర వేళ.. శుభాకాంక్షల హేల



ఎంపీ సత్యవతికి బొకే అందిస్తున్న దివ్యాంగులు

- ఊరూవాడా నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

అనకాపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీ బీవీ సత్యవతి కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు జరిగాయి. ఎంపీ సత్యవతి, కాండ్రేగుల విష్ణుమూర్తి దంపతులకు వైఎస్సార్‌సీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. 82, 83వ వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మిలు పూలబొకేలు అందించి, ఎంపీ దంపతులకు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేతలు ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా దివ్యాంగ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఎంపీ సత్యవతిని దివ్యాంగులు కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు, దివ్యాంగులు బుద్ద ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, వి.శ్రీనన్న, చవితి కృష్ణవేణి, పెట్ల సన్యాసిరావు, పి.నర్సింగరావు పాల్గొన్నారు.
- నర్సింగరావుపేట 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతుల స్వగృహానికి జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు కడిమిశెట్టి సతీష్, సిద్ధి లింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సుదిరిపాటి తాతాజీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండా రమేష్‌గుప్తా చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు.



దాడి వీరభద్రరావు, రత్నాకర్‌లకు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నేతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు

- 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులను వారి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నేతలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గంటా సముద్రాలు, శ్రీను పాల్గొన్నారు.
- జిల్లా ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎస్పీ కేవీ మురళీకృష్ణ కేక్ కట్ చేసి పోలీసు అధికారులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కిందిస్థాయి అధికారులు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచేందుకు కృషి చేయాలన్నారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ సత్యనారాయణరావు, డీఎస్పీ వి.సుబ్బరాజు, పి.శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ భవ్యరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.
- పట్టణంలో గవరపాలెం పెదరామస్వామి కల్యాణమండపంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మండపానికి చేరుకుని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, యువనేత దాడి జయవీర్‌లను గజమాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు రత్నాకర్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఆలయ ఈవో బండారు ప్రసాద్, కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కర్, పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు దంపతులు, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు, ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ నాయకులు, రెవెన్యూ, జీవీఎంసీ, విద్యుత్, విద్య, వ్యవసాయ తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, వేల్పుల వీధి, కుంచావారివీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌యార్డు వర్తకులు, కళాసీలు, గుమస్తాలు, కొలగార్లు, రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.
- బీసీ సంక్షేమసంఘ కార్యాలయంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు రమణబాబుకి సంఘ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు రమణబాబు విద్యార్థులకు స్టేషనరీ, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పిల్లల శంకర్, ప్రధాన కార్యదర్శి కొంద్రపు కృష్ణమనాయుడు, జిల్లా అధ్యక్షుడు జె.అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.



మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులను సత్కరిస్తున్న సతీష్, తాతాజీ, రమేష్‌గుప్త

కశింకోట: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రధానంగా యువతీ యువకులు ఆదివారం రాత్రి వీధుల్లోను, ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేసి నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. అర్ధరాత్రి తర్వాత కేరింతలు కొడుతూ పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- ఎంపీపీ కలగా లక్ష్మిని అధికారులు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు, పండ్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్‌ను పలువురు పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తి, ఉపాధ్యాయులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.
- నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక గవరపేటలోని దుర్గమాంబ ఆలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కశింకోట: మండలంలోని చర్చిల్లో సోమవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఆంధ్ర కల్వరీ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ సన్నీజేమ్స్ క్రీస్తు ప్రవచనాలను ప్రస్తుతించారు. పిల్లలు క్రిస్మస్ తాత వేషధారణతో అలరించారు. పిల్లలకు బైబిల్ చదవడం, క్విజ్, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్, బాలికల హైస్కూలు హెచ్ఎం స్వర్ణకుమారి, చర్చి ప్రతినిధులు మోజెస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- గవరపేటలోని ఏసు క్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ వై.సునీల్‌బాబు ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కృపారావు పాల్గొన్నారు.
- హౌసింగ్ కాలనీ వద్ద షాలెం మందిర్, బయ్యవరం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, నరసింగబిల్లి తదితర చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.
- తుమ్మపాలలోని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.
- ఎంపీపీ గొర్లి సూరిబాబుకు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. పార్టీ నేతలు, కార్యకర్తలు, ఎంపీడీవో కె.నర్సింహారావు, తహసీల్దార్ గంగాధరరావు, ఈవోఆర్డీ ధర్మారావు తదితరులు ఆయన్ని కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.



కశింకోటలోని గవరపేట ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో కొవ్వొత్తులతో క్రైస్తవుల ప్రార్థనలు



గొర్లి సూరిబాబుకు శుభాకాంక్షలు చెప్తున్న రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు